క్లుప్తంగా

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై సంతోష్

శ్రీరాంపూర్: ఎన్నికల్లో స్వేచ్ఛగా ఓట్లు వేయాలని శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ తెలిపారు. శ్రీరాంపూర్ కొత్తరోడ్‌లో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులతో మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని, ఓటర్లు ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి సెలవులు ఉన్నందునా దొంగతనాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, కావున ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాడల్లో, కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ సభకు తరలిన నాయకులు

జన్నారం: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్మల్‌లో నిర్వహించిన జనజాతర సభకు హాజరైన రాహుల్‌గాంధీ సభకు జన్నారం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, సీనియర్ నాయకులు రాజశేఖర్, మోహన్‌రెడ్డి, శుభాష్‌రెడ్డి, ఫసీఉల్లా, శంకరయ్య, ఇసాక్‌లతో పాటు వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బస్సులు, ఇతర వాహనాల ద్వారా తరలి వెళ్లారు. మూడువేల మంది కార్యకర్తలు తరలివెళ్లినట్లు పార్టీ నాయకులు తెలిపారు.

సైనిక్ స్కూల్‌కు ఎంపిక



శ్రీరామ్


అక్షిత్


నిశ్విత్

తాండూర్: తాజాగా విడుదలైన రుక్మాపూర్ సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్షల ఫలితాల్లో తాండూరు మండలం మాదారం టౌన్‌షిప్‌కు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. ముగ్గురు విద్యార్థులు ఒకే గ్రామం నుంచి ఎంపికై ఔరా అనిపించారు. మాదారం టౌన్‌షిప్‌కు చెందిన కుప్పపల్లి మీనా–లక్ష్మణ్ దంపతుల కుమారుడు కుప్పపల్లి శ్రీరామ్ ఇటీవలే నవోదయకు ఎంపికయ్యాడు. తాజాగా రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు సైతం ఎంపికై శభాష్ అనిపించుకున్నాడు. అదే గ్రామానికి చెందిన అసంపల్లి శ్రీనివాస్–కావ్యల కుమారుడు అక్షిత్, శనిగారపు క్రాంతి–మౌళిక కుమారుడు నిశ్విత్ రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు ఎంపికయ్యారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు రుక్మాపూర్ సైనిక్ పాఠశాలకు ఎంపిక కావడంతో స్థానికులు, బంధువులు, కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

తాండూర్: మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సీఐ కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం కేంద్ర బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్‌ఎఫ్ డీఎస్పీ రాకేష్ మిత్ర, ఎస్సైలు చంద్రమిస్త్రీ, అనూష, విజయ్, గంగారాం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టుకున్నారు.. విడిచిపెట్టారు?

జైపూర్: మండలంలోని రామారావుపేట శివారులో నాలుగైదు రోజులుగా అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లుగా వచ్చిన ఫిర్యాదులపై రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రెండు లారీలు పట్టుకోగా.. ఆ లారీలను పోలీసులు వదిలిపెట్టడంపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. రామారావుపేట శివారులో వాస్తవానికి ఒక్క క్వారీకి మాత్రమే అనుమతులు ఉండగా, దీనికి కొంత దూరంగా హైదరాబాద్ రాజీవ్ రహదారికి సమీపంగా ఎలాంటి అనుమతులు లేకుండా పగలు, రాత్రి మరో క్వారీలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతుండగా రెండు రోజుల క్రితం మైనింగ్ అధికారులు ఒక్క లారీని పట్టుకోగా, తాజాగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మరో రెండు లారీలను పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించారు. అనుమతులు ఉన్న క్వారీకి సంబంధించిన పత్రాలను చూపించి అక్రమంగా తరలిస్తున్న ఆ లారీలను విడిపించుకుపోయినట్లుగా సమాచారం.

భద్రత కట్టుదిట్టం..!

- పార్లమెంట్ ఎన్నికలకు పోలీసు శాఖ సన్నాహాలు
- సమస్యాత్మక ప్రాంతాల గుర్తింపు



నెన్నెలలో కల్వర్టును తనిఖీ చేస్తున్న బెల్లంపల్లి సీఐ అఫ్జలొద్దీన్

నెన్నెల: అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని పోలీసుశాఖ భావిస్తోంది. ఇందుకోసం పదిహేను రోజుల నుంచి అధికారులు క్షేత్రస్థాయిలో భద్రత ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. నియోజకవర్గంలో ఆయా ఠాణాల పరిధిలోని గ్రామాల్లోని ప్రజలకు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని అవగాహన కల్పిస్తున్నారు. ప్రజల్లో మనోధైర్యం పెంచడానికి భరోసా ఇస్తున్నారు. ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసుశాఖ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి సారిస్తోంది. బెల్లంపల్లి నియోజకవర్గంలో మొత్తం 227పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం లొకేషన్స్ 148 ఉండగా సమస్యాత్మక లొకేషన్స్ 14, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు 8, నార్మల్ లొకేషన్స్ 126 గుర్తించారు. ఇందులో ఎన్నికల తేదీ నాటికి ఆయా గ్రామాల్లో పరిస్థితుల ఆధారంగా అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోవాలని పోలీసులు భావిస్తున్నారు. గతంలో నేరప్రవృత్తి కలిగిన ప్రతి ఒక్కరినీ బైండోవర్ చేసే పనిలో పడ్డారు. కల్వర్టుల వద్ద, వాహనాల తనిఖీని ముమ్మరం చేస్తున్నారు.

చైతన్య కార్యక్రమాలు..

నియోజకవర్గంలో సుమారు 2 వేల సీసీ కెమెరాలతో పాటు 30 రూట్‌లను ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 3, ఎంసీసీ టీమ్‌లు ఏడు ఏర్పాటు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు చూస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించారు. మావోయిస్టు గ్రామాలైన నెన్నెల, భీమిని, దేవాపూర్, తాండూర్, వేమనపల్లి, కన్నెపల్లి మండలాల్లోని ప్రజలకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటర్లలో చైతన్యం నింపి శాంతియుత వాతావరణానికి సహకరించాలని కోరుతున్నారు. ఎన్నికలకు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఘర్షణలు, కవ్వింపు చర్యలు, మద్యం, డబ్బులు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తులను బైండోవర్ చేస్తున్నారు. సమస్యాత్మక గ్రామాలకు పోలీసులు వీలైనన్నిసార్లు వెళ్లి పరిస్థితులను అంచనా వేసే పనిలో పడ్డారు. గ్రామాల్లో అనుమానితుల కదలికలపై నిఘా పెట్టారు.

అదనపు బలగాలు..

ఎన్నికలకు అవసరమైతే అదనపు బలగాలను ఉపయోగించనున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న వారే కాకుండా కొన్ని రిజర్వు బలగాలను కూడా అందుబాటులో ఉంచినట్లు ఏసీపీ బాలుజాదవ్ తెలిపారు. ఎన్నికల తేదీ సమీపించినప్పుడు అక్కడి పరిస్థితిని బట్టి అదనపు బలగాలను అక్కడికి తరలించే వీలుంది. ఆయా గ్రామాల్లో వీడియోచిత్రీకరణ చేస్తూ పరిస్థితిని అంచనా వేయనున్నారు.

సరిహద్దులో తనిఖీ కేంద్రాలు..



అక్రమ మద్యం, డబ్బు తరలింపును నిరోధించడానికి గ్రామాల సరిహద్దులో పోలీసుల తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఐబీ తాండూర్‌లో రెవెన్యూ, పోలీసు శాఖల ఆధ్వర్యంలో ఒక చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఐబీ తాండూర్‌లో, బెల్లంపల్లి పోచమ్మగడ్డ, సోమగూడెం టోల్‌ప్లాజా వద్ద చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో పోలీసు అధికారులు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ తనిఖీ కేంద్రాలు ఎన్నికలు పూర్తయ్యే వరకు నిత్యం 24 గంటల పాటు పని చేయనున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి తర్వాతే అనుమతి ఇస్తున్నారు. ఠాణాల పరిధిలోని గ్రామాల్లో భద్రత పెంచుతున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారు, అల్లరి మూకలపై ఒక నజర్ వేశాం. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పక్కాగా ప్లాన్ చేశాం. ప్రధానంగా డబ్బు, మద్యం, కానుకల పంపిణీ నిరోధిస్తాం. ఓటర్లను ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తే కేసు నమోదు చేస్తాం. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాలి. సహకారం అందించాలి.

– రవికుమార్, ఏసీపీ(బెల్లంపల్లి)

పోచమ్మతల్లికి పూజలు



విగ్రహ ప్రతిష్టాపనలో ఎమ్మెల్యే వివేక్

జైపూర్: మండలంలోని ముదిగుంట గ్రామ పంచాయతీ పరిధిలో గల రసూల్‌పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన పూజా కార్యక్రమాల్లో చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో ప్రజలు సుఖసంతోషాలతో పాటు పాడిపంటలు సంవృద్ధిగా పండాలని గ్రామంలో నూతనంగా ఆలయం నిర్మించినట్లుగా తాజా మాజీ సర్పంచ్ దుగుట జ్యోతిపాండరి తెలిపారు.

బీజేపీలో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో 200మందికి పైగా యువకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బింగి ప్రవీణ్, చెల్ల విక్రమ్, రజనీశ్ జైన్, వెంకటేశ్వర్‌రావు, బోయిని హరికృష్ణ, రాకేశ్ రెన్వా, ఎనగందుల కృష్ణమూర్తి, జోగుల శ్రీదేవి, అమిరిశెట్టి రాజు పాల్గొన్నారు.

ఉచిత బాక్సింగ్ శిక్షణ ప్రారంభం



ఉచిత బాక్సింగ్ శిక్షణకు హాజరైన చిన్నారులు

మంచిర్యాలటౌన్: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో బాక్సింగ్ ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాక్సింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు నిట్టూరి మైసూర్ పాల్గొని, విద్యార్థులు మానసికంగా ఎదిగేందుకు, శారీరకంగా ధృఢంగా ఉండేందుకు క్రీడల్లో రాణించాలని కోరారు. వేసవి శిక్షణకు అవసరమైన సామగ్రిని అందించిన కూన సుధాకర్‌కు, అసోసియేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మొదటిసారిగా ఉచిత వేసవి శిక్షణను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు, మండల స్థాయిల్లోనూ త్వరలోనే ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉచిత శిక్షణకు హాజరు కావాలనుకునే వారు కోచ్ జగత్‌సాయిని గానీ, 7288871544, 9703335133, 8099824259 నంబర్లలో గానీ సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు రాజన్న, జోడు కృష్ణ, హరి ప్రసాద్, విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి వేముల రమేశ్, కరాటే జిల్లా అసోసియేషన్ కార్యదర్శి శివమహేశ్, జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారుడు బోయిని అశోక్, సీనియర్ బాక్సింగ్ క్రీడాకారులు రేపల్లి మహేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం



దండేపల్లి: వృద్ధురాలి వివరాలు తీసుకుంటూ...



చెన్నూర్ పద్మనగర్ కాలనీలో ఇంటి వద్దనే ఓటు వినియోగించుకుంటున్న దివ్యాంగుడు

చెన్నూర్: నియోజకవర్గంలో హోమ్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైందని చెన్నూర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి చంద్రకళ తెలిపారు. భారత ఎన్నికల సంఘం వృద్ధులకు, దివ్యాంగులకు కల్పించిన ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగంలో భాగంగా స్థానిక పద్మనగర్ కాలనీకి చెందిన దివ్యాంగుడు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. 80ఏళ్ల పైబడిన వృద్ధులకు 40 శాతం పైగా ఉన్న దివ్యాంగులకు ఇంటి వద్ద నుంచే ఓటు వేసే హక్కును వినియోగించుకునే అవకాశం కల్పించిందన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలో ఫారం–12 డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న 46 మంది దివ్యాంగులు, 99 మంది వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి: దివ్యాగులు, 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులకు ఇంటి వద్ద ఓటేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. దీంతో దండేపల్లి మండలంలో ఆదివారం నిర్వహించిన ఇంటి వద్ద ఓటులో 13 మంది దివ్యాంగులు, 9 మంది వయోవృద్ధులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించండి'



మాట్లాడుతున్న నాయకులు

పాతమంచిర్యాల: మతోన్మాద ఫాసిస్ట్ బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టీ.శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ ఫాసిస్ట్ నియంతృత్వాన్ని దేశంపై రుద్దడానికి తగిన భూమిక తయారు చేసుకుందని ఆరోపించారు. పోరాటాలపై పోరాడే సంస్థలపై తీవ్రమైన నిర్బంధాన్ని ప్రయోగించడానికి అవసరమైన విధానాలు చట్టాలను రూపొందించుకుందన్నారు. దేశంలో ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాల కోసం ఎన్‌డీఏ కూటమిని ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బ్రహ్మానందం, లాల్‌కుమార్, ప్రభాకర్, ప్రకాశం, జ్యోతి, అందె మంగ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: బొగ్గు గనుల వేలం చట్టం తెచ్చిన బీజేపీని ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయూ బ్రాంచి అధ్యక్షుడు వెంకటస్వామి అన్నారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. కొత్త గనులకు అనుమతులు ఇవ్వకుండా వేలం పెట్టి ప్రైవేటువారికి అప్పగించే కుట్రలకు పాల్పడిన బీజేపీకి ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. నాయకులు అల్లి రాజేందర్, రామగిరి రామస్వామి, ఐలయ్య, సంజీవ్ పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్‌కే మా మద్దతు'

దండేపల్లి: లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే మా మద్దతు అని తెలంగాణ మాదిగా హక్కుల దండోరా సంఘం ప్రకటించింది. దండేపల్లిలో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం మాట్లాడారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలిచిందని, దీంతో ఈ నెలలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఈశ్వర్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. సంఘం మండల, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

గోదావరి నీళ్లు తెప్పిస్తా.. సమస్యలు పరిష్కరిస్తా

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



కూరగాయల మార్కెట్లో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: పురప్రజల తాగునీటి అవసరాలు తీర్చడానికి గోదావరి నీళ్లను తెప్పించి దీర్ఘకాలం నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. పెద్దపల్లి కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ పక్షాన ఆదివారం చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌తో కలిసి బెల్లంపల్లిలో వినోద్ ఓట్ల ప్రచారం చేశారు. వేకువజామున సింగరేణి తిలక్‌స్టేడియానికి వెళ్లి వాకర్స్ క్రీడాకారులను కలిశారు. కాంటా చౌరస్తాలో కూరగాయల వ్యాపారులు, మహిళలు, భవన, నిర్మాణ కార్మికులను కలుసుకుని ఎన్నికల ప్రచారం చేశారు. నిత్యం జనగణమణ గీతాలాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ.. బెల్లంపల్లి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. బెల్లంపల్లిలో మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరు చేయడం కోసం సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఏర్పాటుకు యత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందునా అభివృద్ధి పనులకు బ్రేక్ పడిందన్నారు. కోడ్ ఎత్తేశాక జూన్ 15 తర్వాత క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించి, ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఆదరించినట్లుగానే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణను అధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యల పరిష్కారానికి ఎన్నికల తంతు ముగిశాక కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వెంకట్రావ్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరిబాబు, టీపీసీసీ సభ్యుడు శంకర్, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శారద, కాంగ్రెస్ నాయకులు స్వామి, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌తోనే హక్కుల పరిరక్షణ'

వేమనపల్లి: కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తేనే ఎస్సీ, ఎస్టీ, బీసీల హక్కులు రక్షింపబడుతాయని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. నీల్వాయిలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్ అధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన ప్రచార సభలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించుకుంటే రూ.50 కోట్ల నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్ని రకాల అభివృద్ధి చేస్తానన్నారు. అనంతరం మండల వైస్ ప్రెసిడెంట్ ఆత్రం గణపతితో పాటు 300మంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సంతోష్‌కుమార్, నాయకులు చిలుముల శంకర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌అలీ, మాజీ సర్పంచ్‌లు గాలి మధు, శంకర్‌గౌడ్, తిరుపతిరెడ్డి, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని సంకారం, బుద్దారం గ్రామాల్లో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేపట్టారు. ఇందులో భాగంగా మాజీ సర్పంచ్ లెంకల గట్టయ్య, ఉప సర్పంచ్ లెంకల భాగ్యలక్ష్మి, వార్డు సభ్యుడు తగరం తిరుపతితో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరగా వారికి కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలి

భీమారం: కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు చేకూర్తి సత్యనారాయణ రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని ఎలకేశ్వరం, లాల్‌బహదూర్‌పేట గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇందులో మండల కాంగ్రెస్ నాయకులు సూరం రాజశేఖర్‌రెడ్డి, పోటు భాస్కరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, బోగె సమ్మయ్య పాల్గొన్నారు.

గడ్డం వంశీకృష్ణకు సంపూర్ణ మద్దతు

నస్పూర్: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు తమ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని నేతకాని (మహర్)సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు దుర్గం నరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జాడి ఎసయ్య తెలిపారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. నేతకానీ సమాజానికి తగిన న్యాయం, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తాము గడ్డం వంశీకృష్ణకు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సిద్ధార్థ రామ్మూర్తి, ఉపాధ్యక్షుడు జనగామ తిరుపతి, రాంబాబు, ప్రమీల, లింగరాజు, శంకర్ పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

నాడు





నేడు

భీమారం: వర్షాకాలంలో పచ్చదనంతో కళకళలాడిన భీమారం సమీపంలోని టేకువనాలు.. నేడు వేసవి ఎండల కారణంగా కళావిహీనంగా మారాయి. మంచిర్యాల అటవీ డివిజన్‌లోని భీమారంలో గల టేకు ప్లాంటేషన్‌లోని చెట్లు వర్షాకాలం పచ్చదనంతో ఎంతో ఆకట్టుకున్నాయి. మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారి వెంట వెళ్లే ప్రయాణికులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేది. పచ్చదనం కారణంగా అనేక మంది వాహనాలు ఆపుకొని అడవి అందాలను ఆస్వాదించేవారు. భోజనాలు చేసి వెళ్లేవారు. కానీ ఈ సారి 44డిగ్రీల వరకు ఎండలు నమోదు కావడంతో చెట్లు కళ తప్పాయి. టేకు వనాలు ఆకులు రాల్చే సమయం కావడంతో అడవి అంతా వెలవెలబోతోంది.

'మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్న ప్రజలు'

చెన్నూర్: దేశ ప్రజలు నరేంద్రమోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ సుహాసినిరెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో పట్టణ, మండల, కమిటీ నాయకులు కార్యవర్గ సభ్యులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెన్నూర్ పట్టణంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి ఇంటింటి ప్రచారం చేయాలని సూచించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబాన్ని ప్రజలు మట్టి కర్పించారని తెలిపారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో కాకా కుటుంబానికి ప్రజలు అదే రకమైన తీర్పు ఇవ్వనున్నారని తెలిపారు. మోదీ ప్రభుత్వంపై ప్రజలు చూపిస్తున్న ఆదరణ చూస్తే పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ గెలుపు తథ్యమన్నారు. కార్యక్రమంలో చెన్నూర్ అసెంబ్లీ ప్రభారి క్యాతం వెంకటరమణ, పట్టణ అధ్యక్షులు జాడి తిరుపతి, పట్టణ ఇన్‌చార్జి పానుగంటి మధు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.